# సాక్షి
## నాగర్‌కర్నూల్

గురువారం, 22, ఆగస్టు, 2024






**జూరాలకు మళ్లీ వరద**

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 57, 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది

వివరాలు 8లో ▸



**సబ్సిడీ రుణాల్లో అక్రమాలు?**

లబ్ధిదారులకు తెలియకుండా కొందరు సబ్సిడీ రుణాలను కాజేశారు.

వివరాలు 8లో ▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
37.3 /22.0

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రైతులందరికీ రుణమాఫీ చేయాలి



**కల్వకుర్తి రూరల్:** రైతులందరికీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం డిమాండ్ చేశారు. బుధవారం కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ షరతులు లేకుండా ఇవ్వాలనే డిమాండ్‌తో గురువారం అమర వీరుల స్తూపం ఎదుట ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో రుణం తీసుకున్న అందరికి రుణమాఫీ చేస్తామని చెప్పి, నిబంధనల పేరుతో ప్రస్తుతం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చైర్మన్ ఆరోపించారు. రైతుల పక్షాన పోరాటం చేస్తామని, ఈ ధర్నాకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. రుణమాఫీ కాని రైతులందరూ, పార్టీ నాయకులు ఈ ఆందోళన కార్యక్రమానికి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ్‌గౌడ్, షాహెద్, సైదులు గౌడ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

### కేజీబీవీల్లో బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

**నాగర్‌కర్నూల్ రూరల్:** జిల్లాలోని 20 కస్తూర్బా విద్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ డైరెక్టర్ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని కేజీబీవీల్లో ఆగస్టు 1వ తేదీ నాటికి రెండు సంవత్సరాలు సర్వీసు కాలపరిమితి పూర్తిచేసుకున్న సిబ్బంది, ఇతర కేజీబీవీల్లో విధులు నిర్వహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 23వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు.

### ఉద్యోగుల కృషితో రాష్ట్రంలోనే అధిక ఓఆర్

**స్టేషన్ మహబూబ్‌నగర్:** ఆర్టీసీ రీజియన్‌లోని అన్ని డిపోల ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారుల కృషితో ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్రంలోనే అధిక ఆక్యుపెన్సి రేషియో (131 నుంచి 132 శాతం) సాధించడం సంతోషంగా ఉందని రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో బుధవారం డ్రైవర్లు, కండక్టర్లు ఇతర ఉద్యోగులకు స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అదనపు బస్సు సర్వీసులు నడిపినట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళా కండక్టర్లు రాఖీ పండుగ రోజు విధులకు హాజరై డిపోల్లోనే తోటి ఉద్యోగులతో పండుగ జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముసుందు రీజియన్‌కు మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు లక్ష్మీధర్మ, శ్యామల, డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఆశలు ఆవిరి!

## ప్రశ్నార్థకంగా మారిన కేఎల్‌ఐ చివరి ఆయకట్టు



వెల్దండ మండలంలోని భర్కత్‌పల్లిలో కేఎల్‌ఐ కాల్వ దుస్థితి

- గుడిపల్లిగట్టు నుంచి నీటి విడుదల చేసి నెలరోజులు దాటినా కల్వకుర్తి ప్రాంతానికి చేరని నీరు
- కాల్వల్లో పెరిగిన చెట్లు, జమ్ము తొలగించకపోవటమే ప్రధాన కారణం
- ముదిరిపోతున్న వరినారు

**కల్వకుర్తి టౌన్:** పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా మారింది కల్వకుర్తి ఎత్తిపోతల పథకం తీరు. కల్వకుర్తి ప్రాంతానికే సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. కల్వకుర్తి ప్రాంతానికి ప్రత్యేకంగా సాగునీరు అందించే ఉద్దేశంతో ప్రాజెక్టు రూపకల్పన చేసినా.. ఈ ప్రాంతానికి మాత్రం ఎప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉంది. ఇక్కడి ప్రాంతానికి సంబంధించి ఇంకా కాల్వలు సరిగ్గా నిర్మాణం చేపట్టకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేఎల్‌ఐ కాల్వలో నీరు విడుదల చేసి సుమారు నెలరోజులు దాటినా.. దిగువ ప్రాంతానికి ఇంకా సాగునీరు చేరుకోలేదు.

**29వ ప్యాకేజీకి నీరందేదెప్పుడు...**

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కాల్వలను 3 ప్రధాన భాగాలుగా విభజించారు. ప్రధాన కాల్వల్లో భాగంగా 29వ ప్యాకేజీ సుమారుగా కల్వకుర్తి ప్రాంతంలో ప్రవహించే సరికి 160 కిలోమీటర్ల మేర పారుతుంది. గుడిపల్లి గట్టు నుంచి కల్వకుర్తి మండలంలోని జంగారెడ్డిపల్లి వరకు 29వ ప్యాకేజీ కాల్వ పారుతుంది. జంగారెడ్డిపల్లి నుంచి కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం నాగిళ్ల వరకు డీ–82 కాల్వ 59 కిలోమీటర్ల మేర పారుతుంది. గుడిపల్లి గట్టు నుంచి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు కేఎల్‌ఐ కాల్వ సుమారు 220 కిలోమీటర్లు పారుతుండగా.. 29వ ప్యాకేజీలో భాగంగా కల్వకుర్తి ప్రాంతానికి పూర్తిస్థాయిలో కాల్వ ద్వారా సాగునీరు రాకపోవటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

### ఏపుగా పెరిగిన చెట్లు

కేఎల్‌ఐ ప్రధాన కాల్వలో వేసివి కాలంలోనే చెట్లను తొలగించి వర్షాకాలంలో వర్షాలు పడేసరికి కాల్వలను పూర్తిగా సిద్ధం చేసి ఉంచాలి. అధికారుల నిర్లక్ష్యంతో కాల్వలో చెట్లు ఏపుగా పెరగటంతో నీరు వచ్చినా.. ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. కల్వకుర్తి మండలం జీడిపల్లి వద్ద స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నీటికి పూజలు చేసి రెండు రోజులైనా.. కల్వకుర్తికి ఇంకా నీరు చేరుకోలేదు. ఎగువ ప్రాంతమైన అచ్చంపేట ప్రాంతంలోని కేఎల్‌ఐ కాల్వ పారే ప్రాంతాల్లో చెరువులు నిండాయి. చెరువులు, కుంటలు నిండి పంటపొలాల్లోకి చేరుతున్నాయి. దీంతో చేతికొచ్చిన పంట చేజారిపోయేలా ఉందని అక్కడి రైతులు వాపోతున్నారు. కాల్వల్లో చెట్లు పెరిగి నీరు ముందుకు సాగడంలేదని, కాల్వలు తెగి నీరు ఎక్కువగా పారటంతో దిగువ ప్రాంతమైన కల్వకుర్తికి నీరు రాకుండా పోయిందని వాపోతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంతోనే..



కేఎల్‌ఐ అధికారుల పూర్తి నిర్లక్ష్యంతోనే కాల్వల నిర్వహణ సరిగ్గా సాగటం లేదు. కల్వకుర్తి ప్రాంత రైతులకు ప్రాణధారమైన కేఎల్‌ఐని అధికారులు పూర్తిగా విస్మరించారు. గుడిపల్లి గట్టు నుంచి నీటిని విడుదల చేసి నెలరోజులు దాటినా ఇంకా కల్వకుర్తి ప్రాంతానికి నీరు రాలేదు. వరి నార్లు వేసి అవి ముదిరిపోతున్నాయని అధికారులకు తెలియజేసినా.. పట్టించుకోవటం లేదు.

– కేవీఎన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ, కొండారెడ్డిపల్లి, సీఎం సొంత గ్రామం

### నీరు రాకపోవటం దురదృష్టకరం..



ఎగువ ప్రాంతం నుంచి నీరు విడుదల చేసినా.. కల్వకుర్తి ప్రాంతానికి నీరు రాకపోవటం దురదృష్టకరం. కొన్నిచోట్ల రైతుల వరినారు ముదరటమే గాక, పలుచోట్ల ఎండిపోయాయి. ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలపై చొరవ తీసుకొని ఇక్కడి ప్రాంతానికి సాగునీరు వచ్చేలా చూడాలి.

–బండెల రాంచంద్రారెడ్డి, రైతు, వెంకటాపూర్

### సాగునీరు వస్తుంది..

కల్వకుర్తి ప్రాంతానికి 29వ ప్యాకేజీ, డీ–82 ద్వారా సాగునీరు వస్తుంది. గుడిపల్లి గట్టు నుంచి నీరు విడుదల చేసినప్పటికిని, కాల్వలో ఏర్పాటు చేసిన మోటార్ల ద్వారా చాలా మంది రైతులు నీటిని తోడేస్తున్నారు. వీటికి తోడు డిస్ట్రిబ్యూటరీ కాల్వలు ఎగువ ప్రాంతంలో పూర్తి కావటంతో చాలావరకు నీరు దిగువకు రావడానికి సమయం పడుతుంది. మరో వారం రోజుల్లో కాల్వలో నీటి ప్రవాహ సామర్థ్యం పెరుగుతుంది. కాల్వల కింద సాగు చేస్తున్న రైతులు ఎవ్వరూ అధైర్యపడొద్దు.

– శ్రీకాంత్, ఈఈ, కేఎల్‌ఐ 29వ ప్యాకేజీ

# మహిళలు స్వశక్తితో ఎదగాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, పక్కన అదనపు కలెక్టర్ దేవ సహాయం

**నాగర్‌కర్నూల్:** పొదుపు సంఘాల ద్వారా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే చేయూతను సద్వినియోగం చేసుకొని, మహిళలు స్వశక్తితో ఎదగాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకం ద్వారా పాడి గేదెలు, పెరిటి కోళ్ల పెంపకంపై మండల స్థాయి సెర్ప్, మెప్మా అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మహిళల కోసం బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ద్వారా రూ.కోట్లు ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 13,086 స్వయం సహాయక పొదుపు సంఘాలు, గ్రామ సహాయక సంఘాలు 617 ఉండగా.. 1,46,446 మంది సభ్యులు మహిళా సంఘాల్లో కొనసాగుతున్నారని తెలియజేశారు. చురుకైన మహిళలను గుర్తించి వారికి బ్యాంకు లింకేజీ ద్వారా పెరటి కోళ్ల పెంపకం, గేదెలు, పౌల్ట్రీ, చిన్న పరిశ్రమలు, ఎంటర్‌ప్రైజెస్, నాటు కోళ్ల పెంపకం, వ్యవసాయ యంత్రాల పరికరాల అద్దె నిర్వహణ లాంటి స్వయం ఉపాధి పనులు కల్పించడంతో మహిళలు ఉన్నతంగా ఎదుగుతారని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్, శ్రీనివాసరావు, ధనరాజ్ పాల్గొన్నారు.

**ఎల్‌ఆర్‌ఎస్ స్క్రూటినీకి ప్రత్యేక బృందాలు**

జిల్లాలో నాన్ లేఅవుట్ భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియకు పర్యవేక్షణ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల కమబద్ధీకరణపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, సాగునీటిపారుదల, మున్సిపల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని, దరఖాస్తులు న్యాయబద్ధంగా ఉన్న వాటిని గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 2020 సంవత్సరం నాటికి 67,603 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సపోర్ట్ సిస్టం అధికారులకు పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిరాబోయే 3 నెలల వ్యవధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేయాలన్నారు.

### గోడౌన్‌కు ఈవీఎంల తరలింపు

ఇటీవల నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో వినియోగించిన నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 885 ఈవీఎంలను తిరిగి జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌కు తరలించినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలియజేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసి 50 రోజులు పూర్తయిందన్నారు. ఈ ఎన్నికపై రాజకీయంగా ఎలాంటి అభ్యంతరాలు రాలేదన్నారు. దీంతో బుధవారం వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ సందర్శించారు. అక్కడి స్ట్రాంగ్ రూం తాళాలు తెరిపించారు. అందులో భద్రపరిచిన ఆయా నియోజకవర్గాల ఈవీఎంలను పరిశీలించారు. వాటిని కలెక్టరేట్‌కు దగ్గరలోని ఈవీఎం గోడౌన్‌కు తరలించి అక్కడ భద్రపరిచారు.



పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను గోడౌన్‌కు తరలింపు ప్రక్రియ పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

# సకాలంలో 'పర్యాటక' పనులు పూర్తి చేయండి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ న్యూటౌన్/పాలమూరు:** జిల్లాలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖ ద్వారా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌కు పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని.. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మినీ ట్యాంక్‌బండ్‌ను కృష్ణా జలాలతో నింపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ఎకో పార్కులో చేపట్టాల్సిన పనులపై త్వరలోనే రాష్ట్ర అటవీశాఖ మంత్రితో మాట్లాడి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని చెప్పారు. పాత కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న త్రీ స్టార్ హోటల్ పనులు కొనసాగించాలని తెలిపారు. శిల్పారామంలోని దుకాణాల కేటాయింపులో మహిళా సంఘాలు, చేతివృత్తుల వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పిల్లలమర్రిలో ల్యాండ్ స్కేప్‌తో పాటు ఫౌంటేన్, చిల్డ్రన్ పార్కు ఇతర అభివృద్ధి పనులు త్వరగా చేపట్టాలని ఆదేశించారు. కాగా, ఎకో పార్కు వెనక వైపు హరిత హోటల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంత్రిని కోరారు.

■ జిల్లాలో టూరిజం అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎకో పార్కులో జంగిల్ సఫారీని పరిశీలించారు. ముందుగా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డిలతో కలిసి మంత్రి మొక్కలు నాటారు.



పిల్లలమర్రి మ్యూజియంలో నంది విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర

### 24న ఉద్యోగ మేళా

**నాగర్‌కర్నూల్ రూరల్:** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయ ఆధ్వర్యంలో ఎస్‌కేసీపీటీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి రాఘవేందర్ తెలియజేశారు. 150 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఆసక్తి ఉన్న 10, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ ఆపై చదివిన 18 నుంచి 35 సంవత్సరాలలోపు నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మేళా స్థానిక నేషనల్ హైస్కూల్‌లో నిర్వహిస్తామని చెప్పారు. ఎంపికైన వారికి రూ.12,500 నుంచి రూ.18,000 వరకు జీతం ఇవ్వడంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం, 50 కిలోమీటర్లలోపు రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఎంపికైన వారికి శంషాబాద్‌లోని కేఎల్ గ్రూప్ అమెజాన్ ఏయిర్ హౌజ్‌లో నేరుగా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. మరింత సమాచారం మేరకు కార్యాలయంలోని 9701200819 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# వృద్ధుల సంరక్షణపై నిర్లక్ష్యం తగదు

**కొల్లాపూర్/బిజినేపల్లి:** కొల్లాపూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో మెజిస్ట్రేట్లు ఆర్‌వీఎస్‌ఎస్ మిథున్‌తేజ, జ్యోత్స్న గుంటి మాట్లాడారు. వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన పలు విషయాలను వివరించారు. పిల్లలు తమ తల్లిదండ్రుల యోగ క్షేమాలు పట్టించుకోకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. పిల్లలతో నిర్లక్ష్యానికి గురవుతున్న వృద్ధులు న్యాయ సహాయం కోరవచ్చన్నారు. వారి తరపున లీగల్ సెల్ బృందం సభ్యులు వాదనలు వినిపిస్తారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, న్యాయవాదులు వసంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌లాల్, నిరంజన్ తదితరులున్నారు.

**సమస్యలు పరిష్కరించకుంటే కోర్టును ఆశ్రయించాలి**

వృద్ధాప్యంలో ఉన్న వారు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆశ్రయించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ జి. సబిత సూచించారు. రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశానుసారం వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా మండలంలోని లూర్ధునగర్ కాలనీ సమీపంలో ప్రశాంత నిలయాన్ని సందర్శించారు. అంతకన్న ముందుగా ప్రశాంత నిలయంలో వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారు నివాసం ఉంటున్న గదులు, వంట గదులను, భోజనశాలను పరిశీలించారు.



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ ఆర్‌వీఎస్‌ఎస్ మిథున్‌తేజ

### ఇద్దరు సీఐలు.. మరో ఇద్దరు ఎస్సైలపై చర్యలు

- పేకాట రాయుళ్లకు పరోక్ష సహకారంలో ఎస్‌బీ సీఐ, ఇద్దరు ఎస్‌ఐల తొలగింపు
- మంత్రి జూపల్లి అడ్డగింతలో భద్రతా వైఫల్యంపై గద్వాల సీఐ ఐజీ ఆఫీస్‌కు అటాచ్

# అవినీతి ఖాకీలపై కొరడా



భీమ్‌కుమార్, సీఐ



జములప్ప, సీఐ ఎస్బీ



విక్రమ్, ఎస్‌ఐ నవాబ్‌పేట



శ్రీనివాసులు, ఎస్‌ఐ

**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/గద్వాల:** శాంతి భద్రతల పర్యవేక్షణతో పాటు అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన ఖాకీలే అడ్డదారులు తొక్కుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా పలువురు పోలీసులు జూదరులకు పరోక్ష సహకారం అందిస్తున్నారు. అంతేకాదు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి పాలమూరులో పలు సంఘటనల నేపథ్యంలో దృష్టి సారించిన ఉన్నతాధికారులు అవినీతి ఖాకీలపై కొరడా ఝుళిపించారు. పేకాటకు సంబంధించి ఓ సీఐ, మరో ఇద్దరు ఎస్‌ఐలతో పాటు గద్వాలలో ఇటీవల మంత్రి జూపల్లి పర్యటనలో భద్రతా వైఫల్యంపై మరో సీఐపై వేటు వేస్తూ మల్టీ జోన్–2 ఐజీ వి.సత్యనారాయణ బుధవారం చర్యలకు ఉపక్రమించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉండవెల్లి కేంద్రంగా పెద్ద ఎత్తున పేకాట దందా కొనసాగుతోంది. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, అనంతపురం జిల్లాలకు చెందిన పేకాటరాయుళ్లు నిత్యం రూ.లక్షల్లో పేకాట ఆడుతుండగా.. దీన్ని అడ్డుకోవాల్సిన పోలీసు అధికారులు.. అక్రమార్కులతో చేతులు కలిపారు. నిత్యం పేకాట సజావుగా కొనసాగాలంటే మామూళ్లు ముట్టజెప్పాలని ఒప్పందం చేసుకున్నారు. దీంతో పేకాట రాయుళ్లకు అనధికారికంగా పోలీసు రక్షణ కల్పిస్తూ, అన్ని రకాల సపర్యాలు చేసి పెడుతున్నారు. ఈ దందా ఏడెనిమిది నెలలుగా కొనసాగుతున్నప్పటికీ.. విషయం బయటకు పొక్కకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఉండవెల్లి కేంద్రంగా పెద్దఎత్తున పేకాట కొనసాగుతున్న వ్యవహారాన్ని గద్వాలకు చెందిన ఓ ప్రజాప్రతినిధి లిఖిత పూర్వకంగా ఐజీకి ఫిర్యాదు చేయడం, మీడియా ద్వారా వెలుగు చూడటంతో ప్రత్యేక దృష్టి సారించిన ఉన్నతాధికారులు.. పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. అయితే ఈ వ్యవహారంలో రికవరీ చేసిన సొమ్మును కొంత నొక్కేశారని కొందరు పోలీసు అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు విచారణకు ఆదేశించారు. ఇందులో ఉండవెల్లి ఎస్‌బీ సీఐ జములప్ప, నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రమ్, ఉండవెల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఇదే విషయాన్ని చర్యల నిమిత్తం నివేదికను ఐజీకి పంపగా.. సీఐ జములప్ప, ఎస్‌ఐలు విక్రమ్, శ్రీనివాసులుపై వేటు వేశారు. తక్షణమే వారిని విధుల నుంచి తొలగించి, ఐజీ ఆఫీసుకు అటాచ్ చేశారు. అనంతరం వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఐజీ సత్యానారాయణ స్పష్టం చేశారు.

**గతంలోనూ ఆరోపణలు..**

నవాబ్‌పేటలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న విక్రమ్‌పై ఇది వరకే అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గతంలో గద్వాల ట్రాఫిక్ ఎస్‌ఐ, నర్వ ఎస్‌ఐగా పని చేసిన ఆయన.. అవినీతికి పాల్పడి ఏసీబీ అధికారులకు దొరికాడు. అయితే కర్నూలు ప్రాంతానికి చెందిన పేకాట రాయుళ్లతో ముందస్తు ఒప్పందం మేరకు ప్రతినెలా రూ.లక్షల్లో మామూళ్లు వసూలు చేసి, జిల్లాలోని కొందరు ఉన్నతాధికారులకు ముట్టజెప్పుతూ జేబులు నింపుకొంటున్నారనే ప్రచారం ఉంది.

**సీఐ భీమ్‌కుమార్‌పై వేటు..**

ఈనెల 17వ తేదీన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాలలో పర్యటించారు. ఈ క్రమంలో మంత్రిని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గీయులు అడ్డుకుని రాళ్ల దాడి చేశారు. దీంతో మంత్రి పర్యటన ఉద్రిక్తంగా మారింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి.. విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పోలీసు బాస్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మంత్రికి భద్రత కల్పించడంలో వైఫల్యం చెందిన గద్వాల సీఐ భీమ్‌కుమార్‌పై వేటు వేస్తూ, ఐజీ ఆఫీసుకు అటాచ్‌మెంట్ చేశారు. అయితే దీనిపై డీఎస్పీ సత్యనారాయణ మాత్రం సీఐ సోదరుడికి అనారోగ్య సమస్యలతో ఆయన సెలవులపై వెళ్లారని.. ఇతర కారణాలు లేవని భిన్నమైన వివరణ ఇవ్వడం చర్చనీయాంశమైంది.

# పక్కాగా ఓటరు జాబితా

**నేటి నుంచి సవరణకు ప్రణాళిక**

- కొత్త ఓటరు నమోదుకు అవకాశం
- మార్పులు, చేర్పులు చేసుకునే వెసలుబాటు
- ఇంటింటి సర్వే చేయనున్న బీఎల్‌ఓలు



**అచ్చంపేట:** జిల్లాలో ఓటరు జాబితా సవరణకు జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేయనున్నారు. దీంతో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓలు) రేపటి నుంచి ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 20న(మంగళవారం) కలెక్టర్ కార్యాలయంలో బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు, రెవెన్యూ అధికారులకు ఓటరు జాబితా సమరణపై ఒకరోజు శిక్షణ తరగులు నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా ప్రకారం ఇంటింటికి వెళ్లి జాబితాలో ఉన్నవారు ఒకే చిరునామాపై ఎక్కువ మంది ఓటర్లు ఉన్నా.. శాశ్వతంగా వేరే గ్రామానికి వెళ్లిపోయినా.. మరణించినా.. పేర్లలో ఏమైనా తప్పులున్నా? డబుల్ ఎంట్రీ తొలగించడం వంటి వివరాలు తెలుసుకుంటున్నారు. జాబితాలో పేరు లేకుంటే వారి నుంచి దరఖాస్తు తీసుకోనున్నారు. ప్రతి బీఎల్‌ఓ తమ వద్ద ఫామ్–6, 7, 8 అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతిఒక్కరికీ ఓటరుగా నమోదు చేసుకునే అవకావం కల్పించారు.

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు**

ఓటరు జాబితా నవీకరణలో భాగంగా జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశాలు నిర్వహించనున్నారు. ఓటరు జాబితాను వారికి చూపించి అభిప్రాయాలు తీసుకోనున్నారు. తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా అందరి సహకారం తీసుకోనున్నారు.

**షెడ్యూల్ ఇలా..**

- ఓటరు జాబితా తయారీ కోసం ఈ నెల 22 నుంచి అక్టోబర్ 18 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి జాబితాను పరిశీలిస్తారు.
- మృతి చెందిన, వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తారు.
- అక్టోబర్ 29న ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు.
- ఆ జాబితాపై అక్టోబర్ 29 నుంచి నవంబరు 28 వరకు సవరణలు, అభ్యంతరాలు స్వీకరిస్తారు.
- అభ్యంతరాలపై మరోసారి బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి డిసెంబరు 24లోగా పరిష్కరిస్తారు.
- కొత్త ఓటరు జాబితాను ముద్రించి వచ్చే ఏడాది 2025 జనవరి 6న ప్రకటిస్తారు.

**7,23,286 మంది ఓటర్లు..**

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాలు, 461 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అలాగే జిల్లా పరిధిలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాలు పూర్తిగా.. కొల్లాపూర్ నియోజవకర్గంలో జిల్లాలోని కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి, కల్వకుర్తి నియోజకవర్గంలో కల్వకుర్తి, వెల్దండ జడ్చర్ల నియోజకవర్గంలోని ఊరుకొండ మండలాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 7,23,286 మంది ఓటర్లు ఉన్నారు.

**అర్హులందరూ ఓటరుగా చేరాలి**



ఓటరు జాబితా అప్‌డేట్ కోసం బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే చేస్తారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి బూత్‌లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారు. మీసేవ కేంద్రాలతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

– మాధవి, ఆర్డీఓ, అచ్చంపేట

## క్లుప్తంగా

### దుస్తులు ఉతికేందుకు వెళ్లి.. వాగులో పడి మహిళ మృతి

**మాగనూర్:** దుస్తులు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని అమ్మపల్లికి చెందిన గుడిసె నర్సమ్మ(55) మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో గల పెద్దవాగులో దుస్తు ఉత్తికేందుకు వెళ్లింది. కాగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయింది. అయితే కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆమె జాడ కోసం రాత్రి మొత్తం వాగులో వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం తెల్లవారుజామున పర్మన్‌దొడ్డి శివారు వాగులో నర్సమ్మ మృతి చెంది ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు మృతిదేహాన్ని బయటకు తీశారు.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


విష్ణు గౌడ్(ఫైల్)

**అమరచింత:** తాగుడుకు బానిసైన వ్యక్తి తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సింగంపేటలో బుధవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విష్ణుగౌడ్(36) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఇంట్లో గొడవలు జరిగిన ప్రతిసారి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడుతూ.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడేవాడు. బుధవారం మధ్యాహ్నం అతను వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన సమీప రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య భార్గవితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### విద్యుదాఘాతంతో మహిళ మృతి


సువర్ణ (ఫైల్)

**వనపర్తి రూరల్:** విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన పెబ్బేరు మండలం కొత్త సూగూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. కొత్త సూగూరుకు చెందిన ముంత సువర్ణ (39) ఇంటి మెట్ల వద్ద ఇనుప చువ్వకు కట్టేసిన గొర్రెపిల్లను విడుస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ స్తంభం నుంచి సర్వీస్ వైర్‌తో పాటు ఉండే ఇనుప తీగను ఇంటి పైకప్పుపై ఇనుప చువ్వకు కట్టడంతోనే కరెంటు సరఫరా అయి ఉంటుందని మృతురాలి భర్త ముంత రాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


### కలుషిత జలాలతో నిండిన పల్లె చెరువు

**రాజాపూర్:** మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులో ఉన్న పల్లె చెరువు బుధవారం కురిసిన ఓ మోస్తరు వర్షానికి తోడు.. సెజ్‌లోని పరిశ్రమలు వదిలిన కాలుష్యపు నీటితో నిండింది. ఈ వర్షాకాలంలో చెరువులు నిండేంత వర్షాలు కురవకున్నా.. కాలుష్యపు జలాలు రావడం వల్లే చెరువు నిండే స్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కలుషిత నీటి వల్ల చెరువులో చేపలు మృతి చెందుతున్నాయని వాపోయారు. కొన్నేళ్లుగా కలెక్టర్‌కు, పీసీబీ అధికారులకు ఫిర్యాదులు కూడా చేసినట్లు పేర్కొంటున్నారు.



# జూరాలకు మళ్లీ వరద

**5 క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**
- ప్రాజెక్టుకు 57,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి


జూరాల వద్ద దిగువకు విడుదలవుతున్న వరద నీరు

**ధరూరు:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరగడంతో ప్రాజెక్టు 5 క్రస్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రానికి 57, 500 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు పేర్కొన్నారు. గేట్ల ద్వారా 20,760, విద్యుదుత్పత్తి నిమిత్తం 39,442, ఆవిరి రూపంలో 92, నెట్టెంపాడుకు 750, కుడి కాలువ ద్వారా 645, ఎడమ కాలువకు 550, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు ఇలా.. ప్రాజెక్టు నుంచి మొత్తం 62,264 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.296 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 3 గేట్ల ద్వారా 12,260 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 33.98 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.

**జోరుగా విద్యుదుత్పత్తి**

**ఆత్మకూర్:** ప్రియదర్శిని జూరాలప్రాజెక్టు దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతోంది. కాగా బుధవారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్లద్వారా 195 మెగావాట్లు, 90.160 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 66.440 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఇప్పటివరకు 147.295 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని అధికారులు వివరించారు.

**శ్రీశైలంలో నీటిమట్టం 882.5 అడుగులు.**

**దోమలపెంట:** శ్రీశైలం జలాశయంలో బుధవారం నాటికి నీటిమట్టం 882.5 అడుగుల వద్ద 201.5822 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 20,760 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 39,442, సుంకేసుల నుంచి 92,652 మొత్తం 1,53,104 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో శ్రీశైలం జలాశయానికి వస్తోంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30,000 క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,410 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 13.681 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశారు. స్థానికంగా 142.00 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

- 21 గేట్లు ఎత్తివేత

**రాజోళి:** సుంకేసులకు ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో అధికారులు బుధవారం 21 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఎగువ నుంచి 95,110 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా..92,652 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలంనకు వదిలి, కేసీ కెనాల్ కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు వివరించారు.


సుంకేసుల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

# చదివే సబ్జెక్టుపై ఆసక్తి అవసరం


మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డి

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** విద్యార్థులు చదివే సబ్జెక్టుపై పూర్తిస్థాయిలో ఆసక్తి ఉండాల్సిన అవసరం ఉందని సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డి అన్నారు. స్థానిక జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సివిల్స్ శిక్షణలో అధ్యాపకుల సలహాలు, సూచనలు పాటించి అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. గతంలో సివిల్స్ సాధించిన సీనియర్ల సూచనలు, సలహాలు కూడా ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాల స్థాయిలో కష్టపడి చదివితే జీవితాంతం సుఖంగా ఉండవచ్చన్నారు. జిల్లాకు సివిల్స్ ర్యాంకర్ అనన్యరెడ్డిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అనన్యరెడ్డికి జైపాల్‌రెడ్డి స్మారక స్ఫూర్తి అవార్డుతో పాటు రూ. 25 వేలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ సుజీవన్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

# ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు


జిల్లా బాలుర జట్టుతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** జిల్లా కేంద్రంలోని మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ యూత్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని స్టేడియంలో 5వ రాష్ట్రస్థాయి యూత్ అండర్–16 అంతర్‌జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నసరుల్లా హైదర్, కోచ్ ఎండీ ఖలీల్, మీర్ ఖాలెద్ అలీ, మహ్మద్ ఇలియాజ్, సుబాన్‌జీ, మహ్మద్ షోయబ్ పాల్గొన్నారు.

**జట్ల వివరాలు..**

బాలుర జట్టుకు ప్రణయ్, కె.అనిల్, రాంచరణ్, శస్వాత్, మహ్మద్ అతిఫ్, ఎం.యశ్వంత్, ఎస్.ఆదిత్, రాజారాం, సాయికృష్ణ, ద్రోణదత్తా, మహ్మద్ అయాజ్, లోకేష్, ఎస్‌ఎస్‌వీ ప్రణీత్, షేక్ మహిత్, మహ్మద్ సిరాజ్, సదానంద ఎంపికయ్యారు. బాలికల జట్టుకు హర్షిత, నిఖిత, వైష్ణవి, చైత్ర, మేఘన, శ్రీజ, పవిత్ర, రాజేశ్వరి, స్నిగ్ధా, నషర ఫాతిమా, టి.సమన్వవి, జి.కావ్య, హిమానయ, సహస్ర, దీక్ష, వరలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు.

# బాలిక గొంతు కోసిన గుర్తు తెలియని వ్యక్తి

- తప్పిన ప్రమాదం.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు


చికిత్స పొందుతున్న సిరి

**మహబూబ్‌నగర్ క్రైం:** ఇంటి ఎదుట ఆడుకుంటున్న ఓ బాలికను గుర్తు తెలియని వ్యక్తి పదునైనా ఆయుధంతో గొంతు కోసి వెళ్లాడు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని శ్రీనివాస కాలనీకి చెందిన జి.సిరి బుధవారం సాయంత్రం శ్రీనివాస కాలనీ పార్క్‌లో తోటి పిల్లలతో కలిసి కాసేపు ఆడుకుని..7 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఇంటి ముందు ఉన్న పాపను గుర్తు తెలియని వ్యక్తి వాహనంపై వచ్చి పదునైనా ఆయుధంతో గొంతు కోసి వెళ్లాడు. రక్తంతో ఇంట్లోకి వెళ్లిన పాపను గమనించిన తల్లి వెంటనే చికిత్స కోసం ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. దీంతో పాపకు గొంతు భాగంలో సర్జరీ చేసి కుట్లు వేశారు. గొంతు దగ్గర లోతుగా తెగక పోవడంతో ప్రమాదం తప్పిందని వైద్యులు తెలిపారు. నిందితుడి కోసం స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

# గొర్రెల సబ్సిడీ రుణాలలో అక్రమాలు?


బ్యాంక్ నుంచి వచ్చిన నోటీసులను చూపుతున్న కోమటికుంటకు చెందిన బాధితులు

- లబ్ధిదారులకు తెలియకుండా రూ.22లక్షల మేర స్వాహా
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

**లింగాల:** లబ్ధిదారులకు తెలియకుండానే వారి పేరిట యాదవ సంఘం పెద్దలు బ్యాంకులో ఎల్టీ రుణాలు తీసుకున్నఘ టన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని కోమటికుంటలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు తమకు జరిగిన మోసాన్ని ఏకరువు పెట్టారు. కోమటికుంటకు చెందిన పలువురు గొల్ల కురుమల పేరిట 2017లో ఏపీజీవీబీ మహబూబ్‌నగర్ బ్రాంచ్‌లో 22 మంది పేరిట అప్పటి యాదవ సంఘం అధ్యక్షుడు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయించారు. లబ్ధిదారులు ఈ రుణాల విషయం ఏమాత్రం తెలియదు. సంఘం సభ్యత్వం గురించి సంతకాలు చేశామని, రుణాల గురించి తమకు తెలియదని లబ్ధిదారులు తెలిపారు. తీసుకున్న రుణాలను చెల్లించాలని జూన్ నెలలో బ్యాంకు నుంచి నోటీసులు రాగా మోసపోయినట్లు గుర్తించారు. ఒక్కొక్కరు రూ.1.60 లక్షలను చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. రుణాలకు సంబంధించి భూములను మార్టిగేజ్ చేయించారని, ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో గతంలో బాధితులు కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ కూడా జరిపించారు. ఇదిలా ఉండగా తమకు అప్పట్లో రూ.90 వేలు ముట్టినట్లు కొంతమంది బాధితులు తెలిపారు. అయితే ప్రభుత్వం రుణాలను మాఫీ చేస్తుందనే నమ్మకంతో ఏడేళ్ల నుంచి ఎదురు చూడగా రుణమాఫీ కాకపోవడంతో లబ్ధిదారులు వడ్డీతో కలిపి రుణ భారం పెరిగినట్లు తెలుస్తుంది. ఇందులో తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడ లేదని, మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి రుణాలను ఇప్పించడం జరిగిందని యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ తెలిపారు. కోమటికుంటలో చాలా వరకు మంజూరైన రుణాలను ఇచ్చినట్లు, కొంతమందికి ఇవ్వాల్సి ఉందని, తనపై ఉద్దేశ పూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.

### పాముకాటుతో బాలుడు మృతి

**ఎర్రవల్లి:** పాముకాటుకు గురై చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. గోపల్‌దిన్నెకు చెందిన బోయ వేణుగోపాల్ (9) మంగళవారం రాత్రి తమ గుడిసెలో నిద్రిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ వేణుగోపాల్ బుధవారం మృతి చెందాడు. అతడి తండ్రి బోయ బజారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

### రైలు నుంచి కిందపడి..

**మానవపాడు:** రైలు నుంచి కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మానవపాడు శివారు ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా.. గుర్తు తెలియని వ్యక్తి(45) రైలులో ప్రయాణం చేస్తూ.. 212/14 మానవపాడు రైల్వే స్టేషన్ మధ్యలో ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తల వెనుక భాగంలో తీవ్ర గాయాలై మృతిచెందాడు. శరీరంపై తెల్లని ఫుల్‌షర్టు, నీలిరంగు ఫుల్‌డ్రాయర్ ఉన్నాయి. షర్టు జేబు వద్ద డీటీ అని టైలర్ మార్కు ఉంది. కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలియజేశారు.

### ఘాటు తగ్గని ఉల్లి

**దేవరకద్ర:** మార్కెట్‌లో ఉల్లి ధర ఏమాత్రం తగ్గడం లేదు. బుధవారం దేవరకద్ర మార్కెట్‌కు దాదాపు 200 బస్తాల ఉల్లి అమ్మకానికి రాగా.. వ్యాపారులు వేలం ద్వారా కొనుగోలు చేశారు. క్వింటాల్ ఉల్లి గరిష్టంగా రూ. 4,030, కనిష్టంగా రూ. 3,760 ధరలు పలికాయి. 45 కిలోల ఉల్లి బస్తా గరిష్టంగా రూ. 2000, కనిష్టంగా రూ. 1,900 వరకు విక్రయించారు. చిన్న సైజులో ఉన్న ఉల్లి క్వింటాల్ ధర రూ. 2 వేల వరకు పలికింది.


దేవరకద్ర మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన ఉల్లిగడ్డ

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో చోరీ

**అలంపూర్:** బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చోరీ జరిగింది. ఈ ఘటన అలంపూర్ చౌరస్తాలో బుధవారం వెలుగుచూసింది. బాధితుల వివరాల మేరకు.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ఎన్‌ఎల్ 01బీ 3535 నంబర్ గల ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మంగళవారం రాత్రి 7:30 గంటల సమయంలో 28 మంది ప్రయాణికులతో బయల్దేరింది. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో 23 మంది ఆన్‌లైన్‌లో, మరో 5 మంది సాధారణంగానే బస్సు ఎక్కి టికెట్ తీసుకున్నారు. అర్ధరాత్రి 12 సమయంలో కర్ణాటక రాష్ట్రం బాజేపల్లి వద్ద బస్సు ఆపడంతో ప్రయాణికులు భోజనం చేశారు. బుధవారం తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్ర సరిహద్దు పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బస్సు ఆపడంతో ప్రయాణికులు వాష్‌రూంకు వెళ్లి వచ్చారు. తిరిగి బస్సు బయల్దేరిన క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రయాణికురాలు ఆశ తన బ్యాగ్‌లో ఉన్న 14 తులాల బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలియజేసింది. అదే సమయంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి చెందిన రూ. 80 వేల విలువ గల ల్యాప్‌టాప్ సైతం చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో అలంపూర్ చౌరస్తాలో బస్సును నిలిపివేసి, ప్రయాణికులను తనిఖీ చేశారు. ఎవరి వద్ద వస్తువులు లభించక పోవడంతో ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఆశ ఫిర్యాదు చేశారు. సీఐ రవిబాబు, ఎస్‌ఐ శ్రీనివాసులు బస్సు వద్దకు చేరుకొని ప్రయాణికులను విచారించారు. కర్ణాటక రాష్ట్రంలోని బాజేపల్లి వద్ద భోజనం కోసం నిలిపిన సమయంలో చోరీ జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసు బృందాలు ఏపీకి వెళ్లి ఈ ఘటనపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

### 616 కిలోల బెల్లం పట్టివేత



**కొల్లాపూర్:** సారా తయారీ కోసం కొల్లాపూర్‌కు తీసుకొస్తున్న 616 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి బంగారయ్య ట్రాన్స్‌పోర్ట్ ద్వారా బెల్లం రవాణా జరుగుతుందనే ముందస్తు సమాచారంతో బుధవారం కొల్లాపూర్‌లో తనిఖీలు చేపట్టామన్నారు. టీఎస్ 31టీ 2806 నంబర్ డీసీఎంలో బెల్లాన్ని గుర్తించామన్నారు. బెల్లాన్ని స్వాధీనం చేసుకొని డీసీఎంను ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్యలక్ష్మి, ఎస్‌ఐలు హనుమంతు, అరుణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### 5న కురుమూర్తి జాతరకు టెండర్లు

**చిన్నచింతకుంట:** మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. భక్తులకు టెంకాయలు, లడ్డూ ప్రసాదం, పూజా సామగ్రి విక్రయించేందుకు, తలనీలాల సేకరణ, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు గాను సెప్టెంబర్ 5వ తేదీన కురుమూర్తి స్వామి దేవస్థానం కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు.



# డ్రగ్స్, పోర్న్ వీడియోలను నిషేధించాలి

- మెడికో విద్యార్థిని అత్యాచారం కేసులో నిందితులను శిక్షించాలి
- చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ శ్రీదేవి డిమాండ్


మాట్లాడుతున్న చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ శ్రీదేవి

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** డ్రగ్స్, పోర్న్ వీడియోలను తక్షణమే నిషేధించాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ శ్రీదేవి డిమాండ్ చేశారు. కోల్‌కతాలో మెడికో విద్యార్థిని అత్యాచారం, హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనను అందరూ ఖండించాలన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో మద్యం, డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు సాగడం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఎంతో మంది అమ్మాయిలు సైతం అదృశ్యమయ్యారని పేర్కొన్నారు. మద్యం మత్తులో బాలికలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిని నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సృజన, శాంత, నర్మద, రాములమ్మ, మన్యం, వెంకటయ్య, ఖలీల్, చక్రవర్తి, బాబుల్‌రెడ్డి, ప్రవీణ్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

### హిందువులపై దాడులు హేయనీయం




**స్టేషన్ మహబూబ్‌నగర్:** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు హేయమైన చర్య అని ప్రముఖ వక్త ఆవుసూరి సాయికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రాత్రి జరిగిన మేధావుల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో ఒకప్పుడు 30 శాతం ఉన్న హిందువుల జనాభా ప్రస్తుతం 8 శాతానికి పడిపోయిందన్నారు. అక్కడ అనేక దేవాలయాలు కనుమరుగయ్యాయని అన్నారు. రాజకీయ కోణంలో చూస్తే ఇది ఒక రిజర్వేషన్ అంశానికి సంబంధించిన విషయం కాదన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులపై మేధావులు స్పందించకపోతే, దేశానికి ఘోరమైన పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో న్యాయవాది నిహారికారెడ్డి, డా. భరద్వాజ్, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.